కంటి వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

మియాపూర్: కంటి వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నడిగడ్డతాండ గిరిజన సంక్షేమ సంఘం భవనంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఫినిక్స్ ఫౌండేషన్ శంకర నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చుట్టుపక్కల కాలనీల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించుకున్నారన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి మల్లెపూలతో విశేష పూజ, నరసింహ హోమం, శ్రీ విష్ణుసహస్ర నామ పారాయణం, వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు 'ప్రజావాణి'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్లకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత శాఖల అధికారులంతా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం అక్కడికక్కడే తగు చర్యలు తీసుకుంటారని వారు వివరించారు.

కురుమ సంఘం నూతన కార్యవర్గం

మణికొండ: గండిపేట మండలం కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మణికొండలోని శ్రీ బీరప్ప మల్లన్న స్వామి ఆలయం భవనంలో మణికొండ కురుమ సంఘం చైర్మన్ బి.జైసింద్‌రావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని చైర్మన్ వెల్లడించారు. అధ్యక్షుడిగా డి.భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రమేష కోశాధికారిగా రత్నాకర్, కార్యదర్శిగా హరికృష్ణలను ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు ఇ.యాదయ్య, పి.మల్లేష్, బి.శ్రీరాములు, బి.ముత్యాలు, డి.రాజు, సి.బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కారులో మంటలు


కాలిపోయిన కారు: తప్పించుకున్న డ్రైవర్



శంషాబాద్ రూరల్: రహదారిపై వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని కారు దగ్ధమైంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... నగరం నుంచి టాటా జెస్ట్ కారు ఆదివారం మధ్యాహ్నం షాద్‌నగర్ వైపు వెళ్తుంది. బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి శివారులో ఉన్న రైల్వే వంతెనపైకి రాగానే కారులో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్ హుస్సేన్ వెంటనే కారును నిలిపివేసి కిందకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోవడంతో పాటు ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మంటలకు కారు ఆహుతైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

పొంగుతున్న మురుగు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సాయిబాబా కాలనీ ప్రధాన రహదారిపై అండర్ డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నిమిషం ఆలస్యమైనా అనుమతించం

13న పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష

- గంట ముందే పరీక్షా కేంద్రంలోకి..
- పరీక్షా కేంద్రాలకు గుర్తింపు కోసం ప్రత్యేక యాప్ రూపకల్పన
- గచ్చిబౌలి పరిధిలో అయిదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- పాలిసెట్-2025 శేరిలింగంపల్లి నోడల్ ఆఫీసర్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ వెల్లడి

రాయదుర్గం: పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని పాలిసెట్-2025 శేరిలింగంపల్లి నోడల్ ఆఫీసర్, రాయదుర్గం జీఐఎల్‌టీ ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్ష కేంద్రంలో గంట ముందే విద్యార్థులను అనుమతిస్తామని వివరించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మంచినీటి వసతి సౌకర్యం, వైద్య కేంద్రం ఏర్పాటు చేసేలా చూశామని, పరీక్ష నిర్వహించే రోజు ఆయా రూట్లలో ప్రత్యేక బస్సులు కూడా అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు?

పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షను మే 13న మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. జీఐఎల్‌టీ రాయదుర్గం పరిధిలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

పాలిసెట్-2025కు శేరిలింగంపల్లి పరిధిలో ఎన్ని పరీక్షా కేంద్రాలు ఉన్నాయి.?

పాలిసెట్-25కు శేరిలింగంపల్లి పరిధిలో అయిదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. అందులో మొత్తం 1,133 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. అందులో రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో 125 మంది విద్యార్థులు, గచ్చిబౌలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 288 మంది, జెడ్పీహెచ్ఎస్ మణికొండలో 288 మంది, జెడ్పీహెచ్ఎస్ నార్సింగిలో 240 మంది, మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 192 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్ష రాయనున్నారు.



పాలిసెట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల గుర్తింపునకు ప్రత్యేక యాప్ రూపకల్పన చేశారా?

పాలిసెట్-2025 పరీక్ష కేంద్రాలను సులభంగా విద్యార్థులు గుర్తించేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఏపీపీ-ఎస్‌బిటీఈటీ టీఎస్‌లో అందుబాటులో ఉంటుంది. దీన్ని గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి హాల్ టికెట్ నెంబర్ టైప్ చేస్తే సులభంగా గుర్తించవచ్చు.

పాలిసెట్‌లో అర్హత సాధిస్తేనే జీఐఎల్‌టీలో సీట్లు పొందవచ్చా ?

పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నికల్ కళాశాలల్లోని కోర్సులలో సీటు పొందేందుకు అవకాశం ఉంటుంది. అందులో ఇంజినీరింగ్, జనరల్ కోర్సులు ఉంటాయి. వీటికి తోడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలోని డిప్లొమో కోర్సులు, జీఐఎల్‌టీ లెదర్ టెక్నాలజీ కోర్సుల్లో సీటు పొందాలంటే పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి.



రాయదుర్గంలోని పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షా కేంద్రం జీఐఎల్‌టీ ప్రధాన భవనం

ప్రవేశ పరీక్షకు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించాం. దీనికితోడు ప్రత్యేక వైద్యబృందం అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు వచ్చినా వారు పరిశీలిస్తారు. అట్లాగే పరీక్షా కేంద్రాలు ఉన్న రూట్లలో కూడా బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచాలని డిపో అధికారులకు కూడా కోరాం.

జీఐఎల్‌టీలో కోర్సులు పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి?

జీఐఎల్‌టీలో నిర్వహించే రెండు కోర్సుల్లో పూర్తి చేసిన వారు ఇప్పటి వరకు 100 శాతం ఉపాధి అవకాశాలు పొందారు. జాతీయ, అంతర్జాతీయ లెదర్ టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగాలు పొందగా, మరికొందరు స్వయం ఉపాధి అవకాశాలు పొందుతూ తోటివారికి కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.





నృత్యం.. నయనానందకరం

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాత్వికారెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శనలో సరస్వతి స్తుతి, ఓంకారకారిణి, పాదసేవనం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. శ్రావ్య బండారు శిష్యబృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శనలో భజమానస విఘ్నేశ్వర, మహాగణపతిం, తిరుతిరు జవరాల, పరమ పురుషుడు, చిన్నిశిశువు, ముద్దుగారే యశోద, నవరసములది నలినాక్షి, రామ్‌భజన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు భవ్య, నిత్య, పవన్‌శ్రీజ, అనేక, సహస్ర, ఝువనా పాల్గొని ప్రదర్శించారు.



కులసంఘాల అభివృద్ధికి కృషి

పటాన్ చెరు: కుల సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం జీహెచ్ఎంసీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలులో తెలంగాణ వీరభద్రీయ (వీర ముష్టి) సంఘం సంగారెడ్డి జిల్లా ఇటీవల నూతన కార్యవర్గ కమిటీ ఏర్పడిన నేపథ్యంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ యువ నాయకులు పృథ్వీ రాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

చదువుతోనే మంచి భవిష్యత్తు

పటాన్‌చెరు టౌన్: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఘణతి ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 571 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో ఆదివారం డివిజన్ పరిధిలోని తన నివాసంలో కార్పొరేటర్ విద్యార్థిని సన్మానించారు. మంచి ఫలితాలు తెచ్చుకునేందుకు ప్రోత్సహించిన తండ్రి రాజును అభినందించారు.

గుంతలమయమైన సీసీ రోడ్డు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి కాళీమందిర్ వెళ్లే సీసీ రోడ్డు గుంతల మయంగా మారింది. దీన్ని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో మంచి నీటి పైప్‌లైన్ల కోసం సీసీ రోడ్డును తవ్వి మరమ్మతులు అంతంత మాత్రంగానే చేశారు. కాలనీలో ఇంటింటికీ తాగునీటి నల్లా కనెక్షన్‌లు, డ్రైనేజీ లైన్లు తీసుకొని రోడ్డును సరిగా పూడ్చి మరమ్మతులు చేయకపోవడంతో అడుగడుగునా గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులతోపాటు పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రమాదాలబారినా పడుతున్నారు. బండ్లగూడ గ్రామం నుంచి వికాస్‌నగర్, షిరిడీ సాయిబాబా కాలనీ, యాదవ మిత్ర కాలనీ, ద్వారకానగర్ మీదుగా కాళీమందిర్ వెళ్లే రోడ్డు వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం

ఆల్విన్‌కాలనీ: తులసీనగర్‌లోని లక్ష్మీ నృసింహ స్వామి జయంతి సందర్భంగా శ్రీ లీలాద్రి క్షేత్ర లక్ష్మీ నృసింహ స్వామి వారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ మాధవరం కాంతారావు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావు, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టి గౌడ్, సత్యనారాయణ, ఎస్.యాదగిరి, ఏడుకొండలు, రవి పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ తదితరులు

నానక్‌రాంగూడలో ప్రత్యేక పూజలు



నానక్‌రాంగూడలోని వీరాంజనేయస్వామి ఆలయంలో హోమం చేస్తున్న బీజేపీ నేతలు

రాయదుర్గం: భారత సైనికులకు విజయం, ఆయురారోగ్యాలు వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. నానక్‌రాంగూడలోని వీరాంజనేయస్వామి ఆలయంలో బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా 'ఆపరేషన్ సిందూర్ ప్లకార్డులను పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శివాసింగ్ మాట్లాడుతూ..భారత సైనిక దళాలు సత్తా ఏమిటో గత వారం రోజులుగా ప్రపంచం అంతా గుర్తించేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరలక్ష్మి, స్వామిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బబ్లూసింగ్, కిషన్, గోపాల్, హేమ, కవితాబాయి రేవతి, శశి, మాజీ సైనికుడు మాణిక్‌రాజ్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత

మోతీనగర్: వయోవృద్ధులను కంటికి రెప్పలాగా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ నెలవారి సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసిన సందర్భంగా సాహిత్య సమావేశాలు, ఉపన్యాసాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. కోఆర్డినేటర్ నలమాల్పు అంజిరెడ్డి, సెక్రటరీ ఏవీ సాగర్, కోశాధికారి కొల్లప్ప, సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: మూసాపేటకు చెందిన పుట్టిగారి అరుణకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ. 2 లక్షల 50 వేల ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో సంబంధిత చెక్కును బాధితురాలి భర్త యాదగిరికి ఆదివారం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

చందానగర్: కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో చంద్ర రాజేశ్వరరావు పాలీ క్లినిక్ అండ్ రోటరీ ప్రోలిఫిక్స్ డయాగ్నొస్టిక్ సెంటర్, జయంతి హాస్పిటల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ సంయుక్తంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు, సీఆర్ పాలి క్లినిక్ డైరెక్టర్ రజని, సలహాదారు డాక్టర్ రంగారెడ్డి, సీఓఓ విజయలక్ష్మి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ అధ్యక్షులు డాక్టర్ టి.సురేష్ బాబు, డాక్టర్ శరత్ చంద్ర పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న డాక్టర్ నారాయణ, ఎమ్మెల్యే గాంధీ

సత్తాచాటిన గౌలిదొడ్డి బాలుర గురుకుల విద్యార్థులు



మహదేవ్



రోహిత్



ఎం.మూర్తి

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్‌లో అద్భుత ప్రతిభ కనబర్చారు. కళాశాల నుంచి 170 మంది విద్యార్థులు హాజరు కాగా 142 మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో కె.చరణ్‌తేజ్ 3,549 ర్యాంకు, పీఎవీ శ్రీనివాస్ 3,574 ర్యాంకు, యోగేంద్ర ర్యాంకు 4,900 సాధించారు. కాగా అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో డి.మహదేవ్ 177వ ర్యాంకు, ఏ రోహిత్ 184 వ ర్యాంకు, ఎం.మూర్తి 249 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ గణేష్ మాట్లాడుతూ..ఎంసెట్‌లో విద్యార్థులు సత్తా చాటారని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న నాణ్యమైన విద్య, బోధన, అధ్యాపకులు సమర్థవంతమైన మార్గదర్శనం, విద్యార్థుల సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు, బోధనలో చొరవ చూపిన అధ్యాపకులను గురుకుల కార్యదర్శి వర్షిని, జాయింట్ సెక్రెటరీ సక్రునాయక్, స్టేట్ ఆఫీసర్ భీమయ్య, ఓఎస్‌డి వివేకానంద అభినందించారు.



చరణ్‌తేజ్



పీఎవి శ్రీనివాస్



యోగేంద్ర

బహిరంగ ప్రదేశాల్లో పటాకులు కాల్చొద్దు

మోతీనగర్: ప్రస్తుతం నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో పటాకులు కాల్చవద్దని అల్లాపూర్ ఇన్ స్పెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పటాకుల కాల్చివేతతో జరిగే అనర్థాలను వివరించారు. పెద్ద శబ్దంతో పటాకులు కాల్చితే ప్రజలు ఆందోళనకు గురవుతారన్నారు. ఎలాంటి దుష్పరిణామాలకు ఆస్కారం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో పటాకులు కాల్చడాన్ని నిషేధించామని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐలు మాజీద్ ఆలీ, మాల్యానాయక్, డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి

వీడని విద్యుత్ మీటర్ల మిస్టరీ

నిబంధనలకు విరుద్ధంగా కేటగిరీ మార్పు

- టీజీఎస్‌పీడీసీఎల్ ఆదాయానికి గండి
- పొజిషన్‌లో లేని మీటర్లకు బిల్లులు
- దళారులతో అధికారులు, సిబ్బంది మిలాఖత్

గచ్చిబౌలి: డొమెస్టిక్ విద్యుత్ మీటరు అలాట్ అయితే 24 గంటల లోపే దాన్ని సదరు వినియోగదారుడి ఇంట్లో బిగించాల్సి ఉంటుంది. అమర్చకుండా మీటర్లను అక్రమంగా నిల్వ చేయడం, వాటికి మినిమం బిల్లులు ఇవ్వడం విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులకే చెల్లుతోంది. ఇటీవల విద్యుత్ మీటర్ల అక్రమంగా నిల్వ ఉంచిన ఘటనలో విస్తుపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. తాము పని చేస్తున్న సంస్థ ఆదాయానికి గండికొడుతూ కేటగిరీలు మార్చడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ మీటర్లు అక్రమంగా నిల్వ ఉంచినట్లు ఏడీఈ అంబేడ్కర్ ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు చిత్రపురి కాలనీలో ఓ ఇంట్లో 42 విద్యుత్ మీటర్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఒక వైపు పోలీసుల విచారణ, మరో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు విచారణ చేపట్టినా అక్రమంగా ఉందుకు నిల్వ ఉంచారో స్పష్టత రావడం లేదు. విద్యుత్ శాక ఏఈ, లైన్‌మెన్ చేతుల్లో ఉండాల్సిన మీటర్లు ప్రైవేట్ వ్యక్తులకు ఎలా చేరాయనే విషయంలోను సంబంధిత అధికారులు నోరుమెదపడం లేదు. కూర్చున్న కొమ్మను నరికిన చందంగా పని చేస్తున్న సంస్థ ఖజానాకు గండికొట్టడం ఎంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



చిత్రపురి కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన మీటర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

అధికారులు మిలాఖత్..

- మీటర్ల గోల్‌మాల్ విషయంలో గచ్చిబౌలి టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో మిలాఖత్ అయినట్లు స్పష్టమవుతోంది. జీపీఎస్ మిషన్ల ద్వారా ప్రతినెలా బిల్లులను రేజ్ చేస్తారు.
- సంబంధిత సిబ్బందికి ఆ మీటరు ఎక్కడుందో జీపీఎస్ మిషన్ ద్వారా తెలుస్తుంది.
- అక్రమంగా నిల్వ ఉంచిన మీటర్ల విషయం, బిల్లుల విషయం సంబంధిత అధికారులు తెలుసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. రీడింగ్ చేసే వ్యక్తి, అధికారులు ప్రైవేట్ వ్యక్తులు చెప్పినట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

కేటగిరీ మార్పు..

- చిత్రపురికాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన విద్యుత్ మీటర్లు కేటగిరీ-1 కింద అలాట్ అయినట్లు తెలుస్తోంది.
- దాదాపు 250 మీటర్లు ఇవ్వాల్సి ఉండగా మొదటి దశలో 42 మీటర్లు ఇచ్చారు. సదరు వినియోగదారుల ఇళ్లకు ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) లేకున్నా మొదటి కేటగిరీలో మీటర్లు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు.
- ఎన్‌ఓసీ లేనప్పుడు కేటగిరీ-2 కింది ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడు బిల్లు కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.
- ఒక వైపు మీటర్లు అమర్చకుండా నిల్వ ఉంచడం ఒక తప్పైతే, మరో వైపు కేటగిరీ మార్చడం రెండో తప్పుగా భావించాలి.
- అంతటితో ఆగకుండా అక్రమంగా నిల్వ ఉంచిన మీటర్లకు గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో పని చేస్తున్న సిబ్బంది బిల్లులు ఇవ్వడం గమనార్హం.
- సంబంధిత వినియోగదారుని నుంచి భారీ మొత్తంలో వసూలు చేసిన తరువాతే మీటర్లు బిగించేందుకు అక్రమంగా నిలువ ఉంచినట్లు తెలుస్తోంది.

మీటర్లపై లోతైన దర్యాప్తు అవసరం..

- విద్యుత్ మీటర్ల గోల్‌మాల్‌లో ఏఈతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారు.
- అంతటితో సరిపెడితే సంస్థకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది.
- వివాదాస్పద స్థలాల్లో ఒక పార్టీ మాత్రమే పొజిషన్‌లో ఉంటుంది.
- డాక్యుమెంట్లు ఉన్న మరో పార్టీ టీజీఎస్‌పీడీఎల్ అధికాలను సంప్రదించి విద్యుత్ మీటర్లు పొందుతున్నారు.
- మీటరు ఎక్కడో ఉంటుంది, బిల్లులు మాత్రం ఆ వివాదాస్పద స్థలం రేజ్ చేస్తారు.
- కోర్టులలో పొజిషన్‌లో ఉన్నామని చూపించుకునేందుకు ఉపయోగపడతాయి. అలాంటి మీటర్లు ఇచ్చేందుకు భారీ మొత్తంలో దండుకుంటున్నట్లు విమర్శలున్నాయి.
- ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి డాక్యుమెంట్ లేకున్నా మీటర్లు ఇవ్వడం సర్వసాధారణమైంది.
- గోపన్‌పల్లి, సర్వే నెంబర్ 74, 149, రాయదుర్గం 5/3, గచ్చిబౌలి సర్వే నెంబర్ 32లో వివాదాస్పద స్థలాల్లో విద్యుత్ మీటర్లు కేటాయించారు.
- ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో ప్రతి కనెక్షన్‌కు పొజిషన్‌లో మీటరు ఉందా లేదా అనే విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.